



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా


శనివారం 13 సెప్టెంబర్ 2025 పేజీలు 8


### మరో మూడేళ్లలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి..

# స్వచ్ఛమైన తాగునీరు

- ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే నూరు శాతం స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం
- త్వరలో అమృత స్కీం టెంటర్లు పిలుస్తాము
- నూతనంగా వచ్చిన డైరక్టర్లు తమ శక్తి మేరకు పనిచేయాలి
- నూతన డైరక్టర్లు వారి ప్రాంతాల్లో చెత్త మేనేజ్ మెంట్ నిర్వహణపై అధిక దృష్టి సారించాలి
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ

వివరాలు 2లో



## నియంత్రణలో డయేరియా కేసులు..



- అయినా అత్యంత అప్రమత్తంగా ఉన్నాం
- బాధితులకు అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందిస్తున్నాం
- ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు.. అయితే జాగ్రత్తగా ఉండాలి
- ఆర్ఆర్ పేటలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం
- బబుల్స్ ద్వారా మినరల్ వాటర్ కూడా సరఫరా చేస్తున్నాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా, సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ :** విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కేసులు నియంత్రణలోనే ఉన్నాయని.. అయినా అత్యంత అప్రమత్తంగా ఉన్నామని, ప్రత్యేక వైద్య బృందాల పర్యవేక్షణలో బాధితులకు ఇటు వైద్య శిబిరంలోనూ, అటు న్యూ జీజీహెచ్‌లోనూ అత్యున్నత ప్రమాణాలతో వైద్యసేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ కేర్ అండ్ షేర్ స్కూల్‌లోని మెడికల్ క్యాంపుతో పాటు న్యూ జీజీహెచ్‌లో డయేరియా బాధితులకు చికిత్స అందిస్తున్న తీరును పరిశీలించారు. రాజరాజేశ్వరిపేటలో తాగునీటి సరఫరా వ్యవస్థలతో పాటు మినరల్ వాటర్ పంపిణీ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వైద్య సేవలు అందించేందుకు మిగతా 2లో

## ఆహార దుకాణాలన్నింటినీ మూసేయండి

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర 2



## బాధితులకు భరోసా..

### డయేరియా ప్రభావిత ప్రాంతంలో పర్యటించిన మంత్రులు, ఎంపీ

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని).. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పురపాలక శాఖ సంచాలకులు పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం తదితరులతో కలిసి శుక్రవారం విజయవాడ, న్యూ రాజరాజేశ్వరిపేటలోని డయేరియా 2లో..





## జిల్లాకు పెద్ద దిక్కుగా నెట్టెం రఘురామ్

- కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా చేస్తున్న కృషి అభినందనీయం
- నెట్టెం రఘురామ్ అభినందన సభలో ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి

వివరాలు 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## నియంత్రణలో డయేరియా కేసులు..

తగినంత సిబ్బంది, మందులు, ఇతర సౌకర్యాలు ఉన్నాయని.. అధికార యంత్రాంగం పూర్తి నిబద్ధతతో పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. సమస్యకు అసలు కారణం తెలుసుకునేందుకు బ్యాక్టీరియల్‌తో పాటు వైరల్, ఫంగల్ పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. డయేరియా సాధారణంగా కలుషిత నీరు, ఆహారం, అపరిశుభ్రత తదితరాల వస్తుందని.. ఈ నేపథ్యంలో ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటినే తాగాలని, కూరగాయలను బాగా కడిగి వండి మాత్రమే తినాలని సూచించారు. వేడివేడిగా ఆహారాన్ని భుజించాలని.. తినక ముందు తిన్న తర్వాత సబ్బుతో బాగా చేతులు బాగా శుభ్రం చేసుకోవాలని, బయటికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు కూడా చేతులు బాగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి చిన్నచిన్న జాగ్రత్తలే మన ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయని, అందువల్ల నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ముందు జాగ్రత్తగా కుళాయి ద్వారా నీటి సరఫరా నిలిపేశామని.. ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నామని, అదేవిధంగా బబుల్స్ ద్వారా మినరల్ వాటర్‌ను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

**భయపడాల్సిన పనిలేదు.. జాగ్రత్తగా ఉండాలి**

ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. అయితే జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గర్భిణీలు, చిన్నారులు, వృద్ధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ సహాయం కావాలన్నా, సమాచారం కావాలన్నా కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ (91549 70454) నంబరుకు కాల్ చేయొచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**బాధితులకు భరోసా..**



ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. కేర్ అండ్ షేర్ వీఎంసీ స్కూల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో బాధితులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను, బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలంటూ డయేరియా బాధితులకు భరోసా కల్పించారు. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలను సమీక్షించి.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, మెరుగైన వైద్య సేవలకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి సంబంధించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. క్షేత్రస్థాయిలో 24X7 ప్రత్యేక బృందాలు సేవలందిస్తున్నాయని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు ఉన్నారు.

## ఆహార దుకాణాలన్నింటినీ మూసేయండి



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : కొత్త రాజరాజేశ్వరి పేటలో గల ఆహార దుకాణాలన్నిటినిను మూసేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కొత్త రాజా రాజేశ్వరిపేట పర్యటించి తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ అంశాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 56, 57, 58 డివిజన్లో 11 సచివాలయాల పరిధిలో గల ప్రతి ఒక్కరికి శుద్ధమైన తాగునీరు బుబుల్స్, టాంకర్ల ద్వారా సప్లై చేయాలని, ఆ నీరును కాచి చల్లార్చి మాత్రమే తాగాలని, 11 సచివాలయాలకు కేటాయించిన 11 స్పెషల్ ఆఫీసర్లు ప్రతి ఒక్కరికి అతిసారా వ్యాధి రాకుండా నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించాలని అన్నారు, నగర పరిధిలో గల ఆర్వో ప్లాంట్ ద్వారా నీటి సరఫరా వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరికి కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్, బిఐఎస్ఐ సర్టిఫికేషన్ ఉండాలని, లేకపోతే వారి దుకాణాలను మూసేయాలని, చికెన్, మటన్, ఆహార దుకాణాలన్నీ మూసివేయాలని, హోటల్లనిటికి ట్రేడ్ లైసెన్స్ కచ్చితంగా ఉండాలని, లేనిచో వాటిని మూసివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథరెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరో మూడేళ్లలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు





విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ శాఖామాత్యులు పొంగూరు నారాయణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగింది. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రగా మార్చాలంటే ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని, ఎవరికి వారు తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రాష్ట్రమంతా స్వచ్ఛత నెలకొంటుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయితీల్లో ముందుగా స్వచ్ఛమైన తాగునీరు, సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, లైట్లు, రోడ్లు ఇలా 18 రకాల సేవలు అవసరమని, ప్రజలు అందరికీ ఈ సేవలను అందించడానికి సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీల్లో వచ్చిన ఆదాయంలో సగం గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే సరిపోతుందని, అయినా దార్శనికుడైన సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజలకు సుపరిపాలన అందించగలుగుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు గతేడాది అక్టోబర్ 2న ప్రారంభించడం జరిగిందని, అప్పటికే గత ప్రభుత్వం వదిలివెళ్లిన 85లక్షల టన్నుల చెత్తను ఈ ఏడాది అక్టోబర్ 2 నాటికి క్లియర్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడం జరిగిందన్నారు. అంత పెద్ద మొత్తంలో చెత్తను క్లియర్ చేయడానికి కనీసం రెండు, మూడేళ్లు పడుతుందని, కాని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్, ఎండీల సహకారంతో ఇప్పటికే 81 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడం జరిగిందని వివరించారు. మరో 20 రోజుల్లో మొత్తం చెత్తను క్లియర్ చేసి అక్టోబర్ 2 నాటికి లక్ష్యాన్ని నూరు శాతం చేరుకుంటామన్నారు. జపాన్, రష్యా, చైనా, ఇలా నేను ఏ దేశం వెళ్లినా మొదట సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ నిర్వహణను పరిశీలిస్తానని తెలిపారు. ఆయా దేశాలు అమలు చేస్తున్న చెత్త నిర్వహణ పై అమలు చేస్తున్న విధానాలు ఇక్కడ కూడా అమలు చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. అందులో భాగమే రాష్ట్రంలో పెద్ద నగరాల్లో డంపింగ్ యార్డులు లేకుండ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి చెత్తను బర్న్ చేసి విద్యుత్ ను ఉత్పత్తి చేయగలుగుతున్నామని మంత్రి నారాయణ తెలిపారు.


అమృత స్కీం టెండర్లను త్వరలో పిలవనున్నామని మంత్రి నారాయణ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్లు తమ శక్తి మేర పనిచేయాలని, నూతన డైరెక్టర్లు వారి ప్రాంతాల్లో వేస్ట్ మేనేజ్ మెంట్ పై దృష్టి సారించాలని, చెత్త నుండి సంపద సృష్టి పై అవగాహన పెంచుకోవాలని సూచించారు.


స్వచ్ఛ ఆంధ్ర ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చెత్త మీద సైతం పన్ను వేసిందని, కాని కూటమి ప్రభుత్వం చెత్త పన్ను తొలగించి ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికే ఉందని నిరూపించిందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం, మంత్రి నారాయణ కృషితో దేశంలోనే అత్యంత ఉత్తమ నగరాలుగా మన రాష్ట్రంలోని ఐదు నగరాలు టాప్ లో నిలిచాయన్నారు. దీంతో జాతీయ స్థాయిలో మన రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. నేపాల్ లో చిక్కుకున్న మన రాష్ట్ర పౌరులను 48 గంటల పాటు శ్రమించి మన రాష్ట్రానికి విజయవంతంగా, క్షేమంగా తీసుకురాగలగటంలో మంత్రి నారా లోకేష్ చేసిన శ్రమ, కృషి మహోన్నతమైనదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్రకు పెద్దపీట వేస్తూ తాను సైతం స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిడమే కాకుండ కార్యక్రమం విజయవంతం చేయడంలో చూపుతున్న శ్రద్ధ ఎనలేనిదని కొనియాడారు. స్వచ్ఛ ఆంధ్ర సాధనలో అందరం ఒక కుటుంబంలా టీమ్ వర్క్ చేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే వెంకటరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఒక విజన్ తో పనిచేస్తాడని, ఆయన ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. స్వచ్ఛత అనేది మన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛతా హీ సేవా అనే కార్యక్రమం ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 17న రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించనున్నామని, అలాగే ఈ నెల 25న ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాత్ అనే కార్యక్రమం లో భాగంగా ప్రతి ఒక్కరూ శ్రమదానం చేయాలని కోరారు. అదేవిధంగా అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివాస్ ను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.

అనంతరం నూతనంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నూతన డైరెక్టర్లుగా ఆరుద్ర భూలక్ష్మీ, లక్ష్మణరావు బొమ్మినాయుని, ఎం. నాగలక్ష్మీ, ముప్పల వెంకట రమణ, ఎన్. ప్రవీణ్ భాను, బొళెం నాగమణి, పడుచూరి భవానీ రవి కుమార్, సాలాది పట్టాభిరామయ్య, బుచ్చా రాము, రెడ్డివారి మంజునాథ్, సన్నారెడ్డి కల్పనారెడ్డి, చిన్ని శ్రీనివాసరావు, టంగుటూరి నాగమ్మ, కూచిపూడి ఉదయభాస్కర్ లు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన 14 మందిని మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు.

# జిల్లాకు పెద్ద దిక్కుగా నెట్టెం రఘురామ్ నిలుస్తున్నారు





జగ్గయ్యపేట మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లాలో ఏ సమస్య వచ్చిన తన అనుభవంతో ఆ సమస్యను పరిష్కరించేందుకు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం పెద్దదిక్కుగా వ్యవహరిస్తారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధ్యక్షులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాంకి ఆత్మీయ అభినందన సభ శుక్రవారం పట్టణంలోని బి కన్వెన్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కె. డి. సి. సి. బ్యాంకు మంజూరు చేసిన 12 కోట్ల 30 లక్షల 75 వేల రూపాయల రుణాలను డ్వాక్రా మహిళలు, రైతులకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నెట్టెం రఘురామ్ అభినందన సభకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏ పదవి చేపట్టిన ఆ పదవికే వన్నె తీసుకువస్తారని కొనియాడారు. కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ పదవీ బాధ్యతలు చేపట్టిన కొద్ది సమయంలోనే రైతులకు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించేందుకు కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్‌గా నెట్టెం రఘురామ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో నెట్టెం రఘురామ్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) తో కలిసి వేదాద్రి ఎత్తిపోతల పథకం, ముక్త్యాల, పోలంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ అభివృద్ధి పనులకి ఎంపీ నిధులు కేటాయిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ ప్రకటించారు. జగ్గయ్యపేట భౌగోళికంగా హైదరాబాద్ - విజయవాడ మధ్యలో ఉండి కూడా పారిశ్రామిక అభివృద్ధి సాధించలేకపోయిందన్నారు.. అయితే, భవిష్యత్తులో డిఫెన్స్ క్లస్టర్ రాబోవడం శుభ సూచకమన్నారు. ఎన్టీఆర్ జిల్లాను అభివృద్ధి పథం వైపు తీసుకు వెళ్లే విధంగా నిర్వహించబోయే విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డ్ ఛైర్మన్ పోతిన బాల కోటయ్య, జగ్గయ్యపేట రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు మేక వెంకటేశ్వరరావు, వత్సవాయ మండల పార్టీ అధ్యక్షుడు వడ్లమూడి బాబు, పెనుగంచి ప్రోలు మండలపార్టీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, నందిగామ మండల కన్వీనర్ తోట నాగమల్లేశ్వరరావు లతో పాటు సీనియర్ నాయకులు, నియోజకవర్గ పిఏసిఎస్ అధ్యక్షులు రైతులు, బ్యాంక్ సిబ్బంది, సొసైటీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దళితులకు ఇచ్చిన భూమిపై వారికి హక్కు కల్పించే వరకు పోరాటం



పెదపారుపూడి మేజర్ న్యూస్: ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూమి విషయంలో హక్కు దారులుగా దళితులను తిరిగి చేర్చే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే ప్రాణాలైనా అర్పిస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) ప్రకటించారు. పెదపారుపూడి మండల పరిధిలోని నాగాపురం గ్రామంలో దళిత సొసైటీకి సంబంధించిన చెరువు భూమి విషయంలో నిజనిర్ధారణ చేసేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా పేదలకు భూమి వచ్చేవరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ విషయంపై సోమవారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేద్దామని తెలిపారు. దళితులకు న్యాయం జరగకపోతే ప్రాణం పోయేవరకు పోరాడుతామని, దళితులకు భూమి వచ్చేవరకు ముందుగా సామరస్యంగా ప్రయత్నాలు చేద్దామన్నారు. ఈ విషయం స్థానిక శాసనసభ్యుని దృష్టికి మరోసారి తీసుకువెళ్లాలని ఆయన స్థానికులను కోరారు. మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ 42 సంవత్సరాల క్రితం ప్రభుత్వం21 కుటుంబాలకి ఇచ్చిన భూమిని వారు సాగు చేసుకుంటున్నారని, ఆనాడే ఎస్సీ కార్పొరేషన్, డిఆర్డిఏ లోన్ శాంక్షన్ చేసి చెరువు తవ్వుకునేందుకు సహకరించారన్నారు. ప్రభుత్వం భూమి ఇచ్చినప్పటినుండి ఇప్పటివరకు ఆ కుటుంబాలు ఆ భూమి మీదే జీవనం గడుపుతున్నాయన్నారు. ఒక ప్రైవేట్ వ్యక్తి దొంగ కాగితాలు సృష్టించి కోర్టుకు వెళ్లి ఇది నాది అని దాఖలు చేయడం జరిగిందని తెలిపారు. 2022 లో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఆ సర్వే నంబర్ ప్రకారం ఉన్న హద్దులకు వారికి భూమిని చూపమని ఆదేశం ఇచ్చిందన్నారు. కోర్టుకు వెళ్లిన వ్యక్తికి భూమి చూపమని ఆదేశం ఇచ్చింది కానీ, వీళ్ళ భూమి లాక్కుని వాళ్లకి ఇమ్మని చెప్పలేదన్నారు. ఒకవేళ ప్రభుత్వానికి అవసరమై వారిచ్చిన భూమి తీసుకోవాల్సి వస్తే వీరికి ప్రత్యామ్నాయ భూమి గానీ పరిహారం గాని ఇచ్చి తీసుకోవాలని చట్టంలో ఉందన్నారు. ఈరోజు వరకు ఆ భూమి సాగు చేసే దళిత రైతు కుటుంబాల స్వాధీనంలోనే ఉందని, కానీ అధికారులు కోర్టు తీర్పు ప్రకారం కాకుండా ఈ భూమిని ఆ రైతుకు ఇచ్చేందుకు ఉత్సాహంతో ఉండటం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఈ కమిటీకి నేతృత్వం వహించిన స్థానిక మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ ఫేక్ హద్దులు, ఫేక్ సర్వే నంబర్లు, ఫేక్ కాయితాలు చూపించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈరోజు అధికారుల దగ్గరికి వస్తే అధికారులు కళ్ళు లేని కబోదుల్లా రాజకీయ పార్టీకి సపోర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ఈ కేసుని సుమోటోగా తీసుకుని దళితులకి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, పెడన, పెనమలూరు నియోజకవర్గాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు ఉప్పాల రాము, దేవభక్తుని చక్రవర్తి తదితరులు పర్యటించారు.

## ఈ నవరాత్రి వ్రతాల వేళ పోషకార పదార్థాలు



విజయవాడ, సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ : సబుదాన, కాలిఫోర్నియా బాదం వంటి పోషకాలు అధికంగా ఉండే పదార్థాలు మెరుగ్గా శక్తిని నిర్వహించడానికి, జీర్ణక్రియకు సహాయపడటానికి, నవరాత్రుల్లో తొమ్మిది రోజుల పాటు మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి సహాయపడతాయి. ఉపవాసాన్ని ఆరోగ్యంగా చేయడానికి, మాక్స్ హెల్త్‌కేర్ వద్ద డైటెటిక్స్ రీజనల్ హెడ్ రితికా సమద్దర్, సాంప్రదాయ వ్రత ఆచారాలను గౌరవించడమే కాకుండా సమకాలీన పోషక అవసరాలకు అనుగుణంగా పోషకాలు అధికంగా ఉండే పదార్థాలపై తన నైపుణ్యంతో కూడిన మార్గదర్శకత్వాన్ని పంచుకున్నారు. రిఫైన్డ్ చక్కెర, వేయించిన ఆహారాలకు దూరంగా ఉండాలని, ఉపవాస కాలంలో శక్తిని, మొత్తం ఆరోగ్యాన్ని నిలబెట్టే సహజమైన, మొత్తం పదార్థాలపై దృష్టి పెట్టాలని.. బాదం, సబుదాన. బుక్వీట్ (కుట్టు), సమక్ రైస్ లను తీసుకోవాలని ఆమె సిఫార్సు చేస్తున్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ నాగరాజు



వత్సవాయి, సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ : మండలంలో గంగవల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యా శాఖాధికారి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఆయన పాఠశాల మధ్యాహ్న భోజన హాజరు రిజిస్టరు రికార్డులు చెక్ చేయడం జరిగింది.పాఠశాలలో భోజన నాణ్యత, పరిశుభ్రత పర్యవేక్షణ క్షుణ్ణంగా పరిశీలించారు.భోజనం రుచికరంగా ఉందో లేదో అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం, గ్రుడ్లు మొదలైనవి అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు ఫీడ్ బ్యాక్ రిపోర్టును పరిశీలించారు. తదనంతరం పిల్లలతో కలిసి ఉపాధ్యాయులు, ఎంఈఓ భోజనం చేసి రుచిని చవిచూశారు. వంట ఏజెన్సీ కి రుచి శుచి ఉండేవిధంగా విద్యార్థులకు భోజనాలు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి.అజ్మీర్ రాం ప్రసాద్, ఉపాధ్యాయులు ఎన్. అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సమస్యలపై పోరుబాట



ఘంటసాల, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత పరిశ్రమను రక్షించేందుకు పోరుబాట సాగిద్దాం లో భాగంగా రాష్ట్ర చేనేత కార్మిక సంఘం నాయకులు ఘంటసాల అందె జగదీష్ స్వగృహమునకు విచ్చేసి చేనేత సమస్యలపై పోరుబాట చేయటం జరిగింది. రాష్ట్రంలో చేనేత కార్మికులు చేనేత సహకారం సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం. రాష్ట్ర ప్రభుత్వం నుండి చేనేత సహకార సంఘాలకు రావలసిన బకాయిలు అధ్యయన కమిటీ దృష్టికి తీసుకురావడం జరిగింది. అలాగే చేనేత సహకార సంఘాలకు త్వరితగతిన ఎన్నికలు జరపాలని, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు జరపాలని, చేనేత కార్మికునికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గత నెలలోనే అమలు జరుగుతాయని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు అమలు జరపకపోవడం చేనేత కార్మికులకు పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమాన్ని పెడన పట్టణం నుంచి మొదలుపెట్టి రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులు ఉన్న ప్రదేశాలన్నీ పర్యటించి వారి సమస్యల అధ్యయన చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ అధ్యయన కమిటీ ప్రయాణం చేస్తుందని వక్తలు చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వరరావు, ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె వి ప్రసాద్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి మాధవ స్వామి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు కట్ట హేమ సుందర్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, సహాయ కార్యదర్శియక్కల పితాంబర్ రావు, కోదాటి నారాయణరావు, కృష్ణా జిల్లా చేనేత మాజీ అధ్యక్షులు కోదాటి నాగయ్య కృష్ణా జిల్లా మాజీ చేనేత అధ్యక్షులు విజయ్ కుమార్ ప్రభృతులు పాల్గొన్నారు.



### శ్రీ ప్రసన్న గణపతి ఉత్సవ పందిరిలో
## అన్న ప్రసాదం వితరణ

నాగాయలంక సెప్టెంబర్ 12 మేజర్ న్యూస్ : నాగాయలంక గ్రామంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ ప్రసన్న గణపతి 68వ వినాయక నవరాత్రి, వార్షిక మహోత్సవ కార్యక్రమములు చిట్టా వారి వంశస్థులు భక్తుల సహాయ సహకారంతో భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నాగాయలంక గ్రామంలో వినాయక స్వామి దేవస్థానం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించినారు.అన్న సమారాధన కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంత గ్రామాల,ప్రజలు సమీప ప్రాంత నివాస స్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించినారు. కళాకారులు భక్తులు నిరంతరము స్వామివారి సేవలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించిన దంపతులకు,గుడి ప్రధాన అర్చకుడు సాయి కి, కార్యక్రమం పూర్తి చేసినందుకు గాను,కమిటీ పెద్దలు చిట్టా.నారాయణరావు, గడ్డిపాటి. ప్రసాద్,మానేపల్లి. శ్రీనివాసరావు,విశ్వంశెట్టి. రాము, చిట్టా.హరే కృష్ణ, చిట్టా.పద్మావతి, చిట్టా.సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, తిరుమల శెట్టి. మస్తానావు,కమిటీ పెద్దలు, భక్తులందరికీ ధన్యవాదాలు తెలిపినారు.

## పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్ను సందర్శించిన ఏడీ



చల్లపల్లి, మేజర్ న్యూస్ : చల్లపల్లి మండలం పురిటిగడ్డ జిల్లాపరిషత్ హైస్కూల్(ప్లస్)ను డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్(మధ్యాహ్న భోజన పథకం) ఎం. విద్యాలత శుక్రవారం సందర్శిం చారు. బియ్యంలో పురుగులు వచ్చిన ఉదంతంపై విచారణ నిర్వహించేందుకు డీఈవో పివిజె.రామారావు ఆదేశాల మేరకు పాఠశాలకు వచ్చిన ఏడీ ఉపాధ్యాయులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, విద్యార్థులతో మాట్లాడారు. భోజనం ఎలా ఉంటుంది, 10వ తేదీన మాత్రమే పురుగులు వచ్చాయా, గతంలో ఎప్పుడైనా వచ్చాయా తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కుకింగ్ ఏజెన్సీవారితో మాట్లాడి మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న తీరును పరిశీలించి వంట రుచిచూసి భోజనం చేశారు. తనిఖీ వివరాలను డీఈవోకు అందచేస్తామని విద్యాలత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మీవో పి.వెం కటేశ్వరరావు, డీఈఓ కార్యాలయ అధికారులు ఎండి. సలీమ్, ఎం. లక్ష్మీ నరసింహారావు, హెచ్ఎం కెబిఎన్. శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మత్స్య శాఖ ఆధ్వర్యంలో సముద్రపు ఉత్పత్తుల నాచు పెంపకంపైన అవగాహన



నాగాయలంక సెప్టెంబర్ 12 మేజర్ న్యూస్ : నాగాయలంక మండలం సర్ల గొండి గ్రామ మత్స్యకార మహిళలకు, స్వయం సహాయ సంఘాలతో మత్స్య శాఖ వారి ఆధ్వర్యంలో అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించినారు. ప్రోటీన్లు మినరల్స్ అధికంగా ఉండే సముద్రపు నాచు ను ఔషధాలకు, కేకుల ను, ఇతర ఆహార పదార్థాలలో విని యోగిస్తు న్నారని, పరిశ్రమలలో కొన్ని రకాల రసాయనాల తో కలిపి ఉపయోగి స్తున్నారు అని తెలియజేయు చూ శిక్షణ కార్యక్రమ తరగతులు, నిర్వహించినారు.ఈ శిక్షణ కార్యక్రమానికి మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రతిభ, అవనిగడ్డ, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి టి.సునీత, పిషరిష్ శాస్త్రవేత్త,ఏ. చంద్రశేఖర్ రావు విచ్చేసి శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగినది.

### సముద్రపు నాచు వల్ల కలుగు ప్రయోజనాలు

1.సముద్రపు నాచులో అధిక మోతాదులో ఉండే ఖనిజాలు, లవణాలు, విటమిన్లు వలన వీటిని ప్రపంచ దేశాలు ఆహారముగా ఉపయోగించడ మే కాకుండా,విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయటానికి ఉపయోగిస్తారు. అదేవిధంగా ప్రయోగ శాలలో మందుల తయారీలో జంతువులకు పశువులకు మేతగా కూడా ఉపయోగిస్తారు.

2) వ్యవసాయ రంగం సముద్రపు నాచు నుండి తయారుచేసిన సేంద్రియ ఎరువు వ్యవసాయ రంగంలో భూమిలోని పోషకాలను మెరుగు పరచి జీవ ఎరువుగా ఉపయోగ పడుతుంది.దీని వల్ల పంట దిగుబడి అధికంగా వస్తుంది.

3) జంతువులకు ఆహారం..

పశువులకు ఆహారంగా వినియోగించడం ద్వారా పోషకాలను అందించి,మిథేన్వాయు వు ఉద్గారాలను తగ్గించి పాల దిగుబడి పొందవచ్చును, అంతేకాకుండా పెంపుడు జంతువుల ఆహారము లో సప్లిమెంట్ గా వాడితే వాటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ వలన జంతువుల లో,రోగనిరోధక,శక్తి పెరిగి,రోగాల,బారి నుండి,కాపాడవచ్చును.

4) సౌందర్య సాధనాల తయారీ, ఔషధ ఉత్పత్తి.. సముద్రపు నాచు మాయిచ్చరైజర్లు,చర్మ సంరక్షణ క్రీములు, షాంపు లలో, ఔషధాల గాయాల పట్టీలు తయారీలో ఉపయోగిస్తారు.

## సిఆర్‌మీడియా అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్ హోదాలో పదవి బాధ్యతలు చేపట్టిన ఎం. భాస్కర నారాయణ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** విజయవాడలోని రాష్ట్ర సమాచార కేంద్రంలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పై సి ఆర్ మీడియా అకాడమీ లో శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. దవి బాధ్యతలు స్వీకరించిన ఎం భాస్కర్ నారాయణ ను సి ఆర్ మీడియా సెక్రెటరీ వి. మణిరాం, అకౌంట్ ఆఫీసర్ శాంతారాం, లైబ్రేరియన్ వి. శేఖర్, జూనియర్ అసిస్టెంట్ ఎం. లోవ రాజు, ఆదిత్య అభినందించారు.

## పవన్ కళ్యాణ్‌కి స్వాగతం పలికిన ఎంపీ బాలశౌరి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ విచ్చేసిన జనసేన అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ని పుషగుచ్చంతో స్వాగతం పలికిన లోక్ సభ జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్, మచిలీ పట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలి జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ లోని చాంబర్‌లో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు జరిగే గాలికుంటు వ్యాధి నిరోధిక టీకాల కార్యక్రమం వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎన్ నరసింహులు, సహాయ సహాయ సంచాలకులు స్వామి తదితరులు పాల్గొన్నారు

## యుటిఎఫ్ రణభేరిని విజయవంతం చేయండి



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఆర్థిక,విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 15 నుండి 19 వరకు జరిగే "రణభేరిని" జయప్రదం చేయాలని యుటిఎఫ్ గుడ్లవల్లేరు మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గుడ్లవల్లేరులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా కార్యదర్శి ఏవి వరలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎప్పటినుండో అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని, విద్యా రంగంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ముఖ్యంగా బోధనేతర కార్యక్రమాలు అమలు చేయవద్దని, యాప్ ల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఉద్యమిస్తున్నదని అందులో భాగంగా ఈనెల కృష్ణాజిల్లాలో 16వ తేదీ జరిగే రణభేరి కార్యక్రమం, సెప్టెంబర్ 25న విజయవాడలో వేలాదిమందితో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు డివిఎం రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కె వెంకట్రావు గౌరవ అధ్యక్షులు ఎమ్. ఆరోగ్యం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు నిర్వహించండి

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 14వ తేదీన జరగనున్న యూపీఎస్సీ – నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ (2), కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ (2) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని.. అభ్యర్థులకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ, సీడీఎస్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ.. యూపీఎస్సీ అబ్జర్వర్ హరీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో తో కలిసి లైజన్ ఆఫీసర్లు, పరీక్షా కేంద్రాల పర్యవేక్షకులు, వైద్య ఆరోగ్యం, విద్యుత్, రెవెన్యూ, రవాణా, పోస్టల్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈ నెల 14న విజయవాడలో ఆరు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని.. సీడీఎస్‌కు 672 మంది, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్షకు 718 అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. సీడీఎస్ పరీక్ష మూడు షిఫ్ట్‌ల్లోనూ, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్ష రెండు షిఫ్ట్‌ల్లో జరుగుతుందని వివరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేయాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్‌టీసీ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ నుంచి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించి విజయవంతంగా పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, పరీక్ష సజావుగా జరిగేలా పోలీసు శాఖ తగిన భద్రత కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా వైద్యశాఖ దిశ ఆధ్వర్యంలో, హెచ్.ఐ.వి, ఎయిడ్స్ ప్రచార రథం ప్రారంభించిన డాక్టర్ ఎ. వెంకట్రావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లా వైద్యశాఖ కార్యాలయం, దిశ ఆధ్వర్యంలో, హెచ్.ఐ.వి, ఎయిడ్స్ ప్రచార రథం ప్రారంభోత్సవం కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డా: ఎ. వెంకట్రావు పాల్గొని హెచ్.ఐ.వి, ఎయిడ్స్ ప్రచార రథమునకు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాలోని ప్రజలందరూ హెచ్.ఐ.వి, ఎయిడ్స్, ఇతర వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ ప్రచార రథమునకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలికి కృతజ్ఞతలు చెప్పారు. అంతేకాక హెచ్.ఐ.వి,ఎయిడ్స్ నియంత్రణ కొరకు సహాయ, సహకారాలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల యొక్క కృషిని కొనియాడారు., ఈ కార్యక్రమంలో పాల్గొన్న దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఎల్ మధుసూదన్ రావు మాట్లాడుతూ ఈ ప్రచార రథం యొక్క ముఖ్య ఉద్దేశం గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రజలకు హెచ్.ఐ.వి, ఎయిడ్స్, క్షయ, సుఖ వ్యాధులుపై చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను తీర్చుకోవచ్చని అన్నారు., రానున్న రోజుల్లో హెచ్.ఐ.వి, ఎయిడ్స్, క్షయ, సుఖ వ్యాధులపై, స్వచ్ఛంద సంస్థల సహకారముతో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. హెచ్.ఐ.వి,ఎయిడ్స్ ప్రచార రథము ద్వారా సుఖ వ్యాధులపై ప్రభుత్వం అందిస్తున్న చికిత్స సేవలపై సందేహాలను తొలగించుకోవచ్చు అని అన్నారు., ఈ కార్యక్రమంలో పాల్గొన్న కె. రవికుమార్,మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్ర మండలి సహకారంతో ప్రచార రథము ద్వారా అందిస్తున్న ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వై. శశికళ,డి ప్రశాంతి,అరుణ్ కుమార్, ఎం అరుణ కిరణ్,, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## కోహన్స్ ఫార్మా కంపెనీ ప్రమాదాలకు నిలయం




**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ :** మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని కోహెన్స్ ఫార్మా కంపెనీలో ఎం రామకృష్ణ అనే కార్మికుడు ప్రమాదానికి గురై చేతి వేళ్ళు నుజ్జునుజ్జు అయ్యాయి. ఆ కార్మికుడకు మెరుగైన వైద్యం అందించి, 15 లక్షలు నష్టపరిహారం అందించి, ఆ కంపెనీలో పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని డివిఆర్ నగర్ లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కోహెన్స్ ఫార్మా కంపెనీ ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. కోహెన్స్ కంపెనీలో భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వలన ఇటువంటి వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలకు ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కారణం అన్నారు. అటువంటి కంపెనీ పై ఫ్యాక్టరీ శాఖ తక్షణం స్పందించి ఫ్యాక్టరీ సేఫ్టీ ఆడిట్ చేయాలని, వరుస ప్రమాదాలకు కారణమవుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రమాదానికి గురై ఉపాధి కోల్పోయిన కార్మికుడను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా, సిఐటియు నాయకులు కోట రవికుమార్, కాకనబోయిన వెంకటేశ్వరరావు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గన్నవరం, సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును. శనివారం ఉదయం 08:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్న అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్పోర్ట్ సిటీ, స్లేట్ స్కూల్, గొల్లనపల్లి, బిబి గూడెం, ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును. కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

# ఘనంగా విక్కుర్తి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ప్రముఖ పారిశ్రామికవేత్త, నియోజకవర్గ నాయకులు విక్కుర్తి వీరరాఘవయ్య ఫౌండేషన్ చైర్మన్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు అభిమానుల ఆనందోత్సాహాల నడుమ పండుగ వాతావరణంలో జరిగాయి. శుక్రవారం ఉదయం స్థానిక ఒకటవ వార్డు లోని విక్కుర్తి గృహంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి తరలివచ్చిన అభిమానులు, శ్రేయోభిలాషులు ఏర్పాటు చేసిన భారీ కేకును విక్కుర్తి శ్రీనివాస్ కట్ చేసి అందరికీ పంపిణీ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను అభిమానులు భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత తండ్రి విక్కుర్తి వీరరఘవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మ వారిని దర్శించుకున్న శ్రీనివాసరావు ను అలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి, శేష వస్త్రాలతో సత్కరించారు. వంతెన సెంటర్లో కొలువైన శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం శ్రీనివాస్, రాంబాబు లను ఆలయ నిర్వాహకులు పోతరాజు ఘనంగా సత్కరించారు. అప్పటికే ఆలయం వద్దకు భారీగా చేరుకున్న విక్కుర్తి అభిమానులతో కలిసి కాలినడకన ఊరేగింపుగా ఇంటికి తరలి వెళ్లారు ఈ సందర్భంగా పలువురు అభిమానులు శీనన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ బాణాసంచా కాల్చి సందడి చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు శీనన్నకు జేజేలు కొడుతూ పూల బొకేలు, దుశ్శాలువాల తో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అభిమానాన్ని చాటుకున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు సైతం శ్రీనివాస్ ను కలిసి జ్ఞాపికలతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. శ్రీనివాస్ ద్వారా లబ్ధి పొందిన పలువురు ప్రజలు శ్రీనివాస్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

**రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ**



ప్రముఖ పారిశ్రామికవేత్త నియోజకవర్గ నాయకులు విక్కుర్తి శ్రీనివాస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. శుక్రవారం విక్కుర్తి పుట్టినరోజు సందర్భంగా ఆయన సోదరులు విక్కుర్తి రాంబాబు న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ లు ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు, హాస్పిటల్ సిబ్బందికి పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బర్మా శ్రీను తిమ్మన కార్తీక్ పాల్గొన్నారు.

# ఘనంగా వైస్ ఎంపీపీ మహేష్ జన్మదిన వేడుకలు

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్ జన్మదిన వేడుకలు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ బాబు, వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య, వాలంటీర్ జిల్లా విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల వంశీకృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యులు మీర్జా దియానత్ అలీ, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గుర్విందపల్లి వంశీ, ఊబా మల్లేశ్వరి, మీర్జా సజాద్ అలి, సర్పంచ్ లు కోటా మణిరాజ్, ఇదాయితుల్లా, మండల పార్టీ ఉపాధ్యక్షులు పాతూరి చంద్రపాల్, బొల్లా సాంబశివరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు గొర్రిపూడి బుజ్జి, కోడిబోయిన కోటేశ్వరరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శులు కంభపు లక్ష్మయ్య, గంధ్రపు వెంకటేశ్వరరావు, కాగిత శ్రీరామమూర్తి ప్రజలతోపాటు తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో



కార్యకర్తలు, పలువురు నాయకులు పాల్గొని మహేష్ ను దుశ్శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మీకేం కాదు.. భయపడకండి..







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం ఉదయం 57వ డివిజన్ కొత్త రాజరాజేశ్వరి పేటలో గల కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఉన్న ప్రథమ వైద్య శిబిరంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అక్కడ చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. వారు భయాందోళన పడాల్సిన అవసరం లేదని, వారికి సరైన చికిత్స అందించి, వారిని ఆరోగ్యకరంగా ఉంచడమే లక్ష్యం అని, విజయవాడ నగర పాలక సంస్థ వారు, వారికి ఎటువంటి హాని కలగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వారితో మాట్లాడుతుండగా కనీసం ప్రథమ ఆరోగ్య శిబిరానికి వచ్చే ఓపిక కూడా లేనివారు ఇంకొంతమంది ఇళ్లలోనే బాధపడుతున్నారని గమనించి, వారికి వాహనాలు ఏర్పాటు చేసి ప్రథమ ఆరోగ్య కేంద్రానికి వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహిస్తూ ప్రతి కుటుంబంలో అనారోగ్యం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## 14న మోడ్రన్ పెంటాథ్లాన్ బయ్యథ్లాన్ జిల్లా సెలక్షన్స్



**గన్నవరం, సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా మోడ్రన్ పెంటాథ్లాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న ఉదయం 9 గంటలకు ఈడుపుగల్లు జడ్.పి.హెచ్. స్కూల్ గ్రౌండ్స్‌లో మోడ్రన్ పెంటాథ్లాన్ బయ్యథ్లాన్ జిల్లా సెలక్షన్స్ నిర్వహించబడనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ ఎం.నరేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు రూ.250/- నమోదు రుసుము జమచేసి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ కేటగిరీలలో అబ్బాయిలు – అమ్మాయిలు పోటీలకు హాజరు కావచ్చునని చెప్పారు. పాల్గొనే వారు స్పోర్ట్స్ డ్రెస్, షూస్ తదితర క్రీడా సామగ్రి తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలు జిల్లా స్థాయికి ఎంపికై, కాకినాడలో సెప్టెంబర్ 20, 21 తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ బయ్యథ్లాన్ ఛాంపియన్‌షిప్లో పాల్గొనుటకు అర్హత సాధిస్తారని వివరించారు. వివరముల కోసం 9441812694, 7893640575 నంబర్లను సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

## ఘనంగా కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి



**పామర్రు మేజర్ న్యూస్:** సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత మహానేత కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం పామర్రు లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక పుట్లమ్మ సత్రం భవనం మీద ఏర్పాటు చేసిన ఏచూరి చిత్రపటానికి సిపిఎం పామర్రు మండల మాజీ కార్యదర్శి కాటూరి నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పామర్రు మండల మాజీ కార్యదర్శి దునుకు రఘునాధరావు, చాట్లవానిపురం శాఖా కార్యదర్శి చాట్ల రాంబాబు, బి.ఎస్.పి నాయకులు దాసరి భాను, పామర్రు పంచాయితీ మాజీ సభ్యుడు చాట్ల శ్రీనివాసరావు, చిరికి వెంకటేశ్వరరావు, ఇంగ్లీష్ లెక్చరర్ పెనుమాల వెంకటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు,ఈడే కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అపార మేధావి, రాజకీయ దురంధరుడు, అభ్యుదయవాది, సిపిఎం అగ్రనాయకులు అయిన సీతారాం ఏచూరి అకాల మరణం పార్టీ కి తీరని లోటని పేర్కొన్నారు.

## చల్లపల్లికి పుష్కలంగా యూరియా

**ఆరు సొసైటీలు, ప్రవేటు డీలర్లకు 174.20 టన్నుల యూరియా రాక**



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలానికి యూరియా పుష్కలంగా రావటంతో ఆయా గ్రామాల్లో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. చల్లపల్లి సొసైటీకి 10.10 టన్నులు, లక్ష్మీపురం సొసైటీకి 20 టన్నులు, మంగళాపురం సొసైటీకి 20 టన్నులు, మాజేరు సొసైటీకి 20 టన్నులు, పురిటిగడ్డ సొసైటీకి 20 టన్నులు, వక్కలగడ్డ సొసైటీకి 15 టన్నులు, లక్ష్మీపురంలో ప్రవేటు డీలర్లకు 18 టన్నులు, పురిటిగడ్డలో ప్రవేటు డీలరుకు 49.50టన్నులు చొప్పున మొత్తంగా 174.20 మెట్రిక్ టన్నుల యూరియా రావటంతో గ్రామాల్లో ముమ్మరంగా యూరియా పంపిణీ జరిగింది. ఏవో కె.మురళీకృష్ణ పర్యవేక్షణలో ఆయా సొసైటీల చైర్మన్లు బొందలపాటి వీరబాబు, యార్లగడ్డ సోమశేఖరప్రసాద్(లంకబాబు), పరుచూరి వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి బాలనాగేశ్వరరావు, దేవనబోయిన హరనాథ్, మల్లుపెద్ది దుర్గామహేష్, సీఈవోలు తోట కృష్ణారావు, లంకపల్లి రమేష్బాబు, చంద్ర రవికుమార్, ఎస్ఎస్. చక్రపాణి, కంఠంనేని నాగేశ్వర రావు, పుట్టి వెంకటేష్ల సమక్షంలో సొసైటీ సిబ్బంది, వీఏఏలు రైతులకు యూరియా పంపిణీ చేశారు. లక్ష్మీపురం ప్రవేటు డీలరువద్ద యూరియా పంపిణీని తహసీల్దార్ డి.వనజాక్షి, ఏవో మ ఎరళీకృష్ణ పరిశీలించి రికార్డులు చూశారు.



## కృష్ణారావు విగ్రహానికి కూటమి నాయకుల ఘన నివాళి

**నాగాయలంక మేజర్ న్యూస్:** నాగాయలంక గ్రామంలోని షిరిడి సాయి బాబా దేవస్థానం సమీపంలో మండలి. వెంకట కృష్ణారావు విగ్రహానికి, డీసీ చైర్మన్ బండ్రెడ్డి వెంకట నాగ మల్లికార్జున రావు, మెండు. లక్ష్మణరావు, పూల మాలవేసి నివాళి అర్పిం చితిరి. 39వ రోజు జరిగిన కార్యక్రమంలో భాగం గా నిర్వహణ కమిటీ సభ్యులు నివాళులు అర్పించినారు. కార్యక్రమంలో భాగంగా,బిజెపి నాయకులు నాగాయలంక మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శివాజీ, బిజెపి సీనియర్ నాయకులు చెన్నగిరి. లతా మోహన్, బి.జె.పి యువనాయకుడు,కన్నా.నాని,, మండలి వెంకట కృష్ణారావు అభిమా నులు,తాడేపల్లి.పాపారావు,తలశిల. రామకృష్ణ (చౌదరి మాస్టర్), సనక సురేష్,కైతేపల్లి. ఆనంద్ తలశిల.రాఘవరావు, ముమ్మా రెడ్డి.శ్రీనివాసరావు, షేక్. జానీ, భోగి రెడ్డి.బుజ్జి,నాగార్జున, తలశిల.శివరామకృష్ణ, తలశిల శివశంకర్, రేమాల బాబురావు మాదివాడ.అర్జున రావు. ముక్కొల్లు. శివరావు,గుడివాక.శివరావు పాల్గొనిశ్రద్ధాంజలి ఘటించినారు.

## జీవిత సాఫల్య పురస్కారం అందించిన జర్నలిస్టులు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజవర్గంలో పార్టీలకు అతీతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నియోజవర్గంలోని నిరుద్యోగ యువ తకు ఉపాధి అవకాశాలు చూపించడంతో పాటు సామాజిక సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త నియోజకవర్గ నాయకులు విక్కుర్తి శ్రీనివాస్ కి నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించారు. కొన్ని కారణాల చేత కార్యక్రమానికి శ్రీనివాస్ హాజరు కాలేకపోవడంతో శుక్రవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ఎన్ యు జె అనుబంధ సంస్థ ప్రింట్ ఎలక్ట్రానిక్ న్యూస్ యూనియన్ ప్రతినిధులు విక్కుర్తి ని శాలువా పూలమాలలతో సత్కరించి జీవిత సాఫల్య జ్ఞాపికను అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెన్ జాప్ స్టేట్ యూనియన్ నాయకులు సింహాద్రి కృష్ణ ప్రసాద్, లేబాక నాగేశ్వరరావ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డిపాటి సుధీర్, అప్పికట్ల శ్రీనివాసరావు, కోశాధికారి బాల దుర్గా రాంప్రసాద్,సింహాద్రిజయరామ్, యక్కటి కుటుంబరావు, మునీశ్వరరావు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఎంపీ కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జా



**విజయవాడ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సజ్జా అజేయ్ శుక్రవారం గురునానక్ కాలనీలో విజయవాడ పార్ల మెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్లో ఎంపి కేశినేని శివనాథ్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సజ్జా అజేయ్ను ఎంపీ కేశినేని శివనాథ్ శాలువాతో సత్కరించి కొండపల్లి బొమ్మను బహూకరిం చారు. అలాగే విజయవాడ సాంస్కృతిక వైభవం దేశమంతా చాటి చెప్పేలా నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేం దుకు కృషి చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఎంపీ కేశినేని శివ నాథ్ కు కృతజ్ఞతలు తెలిపిన సజ్జా అజేయ్ విజయవాడ ఉత్సవ్ కార్యక్ర మాన్ని విజయవంతం చేయటంలో తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఐ.టి.డి.పి అధ్యక్షుడు చిరుమామిళ్ల కృష్ణారావు, తెలుగు యువత నందిగామ నియోజకవర్గ అధ్యక్షుడు చింతోటి మౌళి, తెలుగు యువత నాయకులు కొడాలి గౌతమ్ పాల్గొన్నారు.

# నివేదికలను వెంటనే అందజేయాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 15,16 తేదీలలో నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు అవసరమైన వివరాలతో కూడిన నివేదికలను వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి కలెక్టరేట్ చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ తో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల అధికా రులతో సమావేశం నిర్వహించి శాఖల వారీగా సమీక్షిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15, 16 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్లో చర్చించే అంశాల పైన వివిధ ప్రభుత్వ శాఖలు వారికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికలను సిద్ధం చేసి వెంటనే అందజేయాలన్నారు. మచిలీపట్నం ఓడరేవు నిర్మాణ పనులు 47 శాతం పూర్తయ్యాయని, నిర్మాణం పనులు మరింత వేగం పుంజుకోవాలన్నారు. వచ్చే సంవత్సరం మొదటి దశ పూర్తయ్యేలా పనులు మరింత వేగం పుంజుకోవాలన్నారు. పచ్చదనం పెంపుదలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకోసం అటవీ శాఖ వారితో సమన్వయం చేసుకోవాలన్నారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పనులు కూడా వేగవంతం చేయాలని ఇప్పటికే చాలాసార్లు పొడిగించడం జరిగిందని సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం స్త్రీ శక్తి పథకం ఎలా నడుస్తుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మచిలీ పట్నం ఓడరేవు నుండి 56 కిలోమీటర్ల బైపాస్ 4 వరుసల రహదారికి సం బంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక అందజేయాలన్నారు. అక్టోబర్ 15 వ తేదీ నాటికి ఇసుకను తవ్వుకునేందుకు వీలుగా ఇసుకరీచులను సిద్ధం చేయాల న్నారు. రికార్డుల సర్వే, మీకోసం అర్జీల పరిష్కారం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, విమానాశ్రయం డైరెక్టర్ ఎమ్ఎల్ కె రెడ్డి, మచిలీపట్నం ఓడరేవు ఈడి పల్లారావు, రైట్స్ కన్సల్టెన్సీ టీం లీడర్ వి ఎం శ్రీనివాస్, డి పి టి ఓ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డిఎం పెద్దిరాజు, డీఐసీ జీఎం ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ జెడ్ యం బాబ్జి, పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, సర్వే భూ రికార్డుల ఏడి జోషిలా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, డీఎఫ్ఓ సునీత, మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజ, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, గృహ నిర్మాణ జిల్లా అధికారి పోతురాజు, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, సిపిడిసిఎల్ ఎస్ ఈ సత్యానందం, గనుల శాఖ ఏజీ కొండారెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులు, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సిఫార్సు లేఖల ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. దాంతో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మొత్తం 139 మంది లబ్ధిదారులకు రూ.66 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంలో పట్టణానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు రూ.15,56,730 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జగ్గయ్యపేట పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ప్రభుత్వం నుంచి అందించే సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) ఎంతో సహాయకారిగా ఉంటుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రతి కుటుంబానికి అండగా నిలిచి అవసర సమయాల్లో చేయూతనందిస్తున్నారని ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను అని అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం కాపాడటమే మా ముఖ్య కర్తవ్యమని భావిస్తున్నాను అని అన్నారు. ఇంకా సీఎంఆర్ఎఫ్ సహాయానికి అర్హులైన వారు ఎవరైనా ఉంటే వారు ఎటువంటి సంకోచం లేకుండా నన్ను సంప్రదించవచ్చు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ,ఇర్రి నరసింహారావు, సంగెపు బుజ్జిబాబు, మల్లెల కొండయ్య, కర్రి చిన్న, మారేపల్లి శౌరి, పున్నా ఉపేంద్ర, గింజుపల్లి కృష్ణ, మారేపల్లి భాష, త్రిపురనేని మురళి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు

**గుడ్లవల్లేరు సెప్టెంబరు 12 మేజర్ న్యూస్:** మండలంలోని పెంజెంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయురాలు రత్నకుమారి మాట్లాడుతూ 1949లో సెప్టెంబర్ 14న రాజ్యాంగ పరిషత్లో హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించినట్లు చెప్పారు. అప్పటినుండి హిందీ దివస్ వేడుకలు నిర్వహించుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. మహాలక్ష్మి మాట్లాడుతూ హిందీ భాషా జాతీయ ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. పిల్లలందరూ హిందీ భాషను అవగాహన చేసుకుని భాష మీద పట్టు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో హిందీ భాషకు సంబంధించిన సాంస్కతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులతో వ్యాసరచన, వక్తృత్వ, హిందీ ప్రాజెక్టులు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్, నాగబాబు, వాసవి, రాంబాబు, సలీమ పాల్గొన్నారు.

## జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ విభాగంలో నారాయణ స్కూల్ ప్రథమ బహుమతి



**గన్నవరం, సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ :** గన్నవరం విద్యానగర్లోని నారా యణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ ప్రదర్శించి, కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాల-బాలికల విభాగ పోటీలలో ప్రథమ బహుమతిను కైవసం చేసుకున్నారు. విజేతలైన విద్యార్థులు ట్రోఫీని అందుకొని పాఠశాల గౌరవాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లారు. నెల్లూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు కూడా వీరు అర్హత సాధించారు. విజేతలను ప్రశంసిస్తూ పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ మస్తాన్ భాషా మాట్లాడుతూ.. ఆటలో ధైర్యం, ఆత్మవిశ్వాసం విజయానికి మార్గం. విజయం కంటే కృషి ముఖ్యమని మన విద్యార్థులు నిరూపించారు అని తెలిపారు. తరువాత పాఠశాల ఏజీఎం సత్తిరెడ్డి మాట్లాడుతూ.. జీవితం కూడా ఒక యుద్ధభూమి లాంటిది. ప్రణాళికాబద్ధంగా పోరాటం చేస్తే ఖచ్చితంగా గెలుస్తాం అని విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించారు. విజేతలకు పీఈటీ ఖమర్ భాష, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు అభినందనలు తెలిపారు.

# ఘనంగా సూపర్ సిక్స్ సూపర్ హిట్ స్త్రీ శక్తి విజయోత్సవ సభ





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో సంపూర్ణ పేదరిక నిర్మూలన సాధించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం అవనిగడ్డ రెవిన్యూ హాలులో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ స్త్రీ శక్తి విజయోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేయటమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి, తల్లికి వందనం, దీపం-2 పథకాలు మహిళలకు వరాలుగా నిలుస్తున్నాయన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం-2 పథకాల ద్వారా నియోజకవర్గ మహిళలకు రూ.42 కోట్లు లబ్ది కలిగిందన్నారు. నియోజకవర్గంలో తల్లికి వందనం పథకం ద్వారా 23,468 మంది తల్లులకు రూ.35,20,20,000లు లబ్ది, దీపం-2 పథకం ద్వారా 58,944 మంది లబ్ధిదారులకు రూ.4,97,99,037 లబ్ది చేకూరిందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణించిన 5,03,763 మంది మహిళలకు రూ.కోటీ 80 లక్షల 43వేల 758 లబ్ది కలిగినట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలను మహాశక్తిగా మార్చేందుకు, ప్రతి ఇంటా ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన ప్రతి హామీని అమలులోకి తెచ్చారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి సూపర్ హిట్ ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటోందన్నారు. పీ-4 ప్రోగ్రామ్ ద్వారా పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామీణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.30 కోట్లతో నూతన సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. వైసీపీ తరహాలో కూటమి ప్రభుత్వంలో రాజకీయ వివక్షకు తావు లేదన్నారు. సీఎంఆర్ఎఫ్ సహాయం పార్టీలకు అతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకూ 15 విడతల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్యానికి రూ.4,27,74,065లు అందించినట్లు తెలిపారు. రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం సమర్థవంతంగా అమలు చేస్తున్న సందర్భంగా తాను ఆర్టీసీ చైర్మనుగా ఉండటం తన అదృష్టం అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు పీ-4 కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ అంగన్వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి వివరించారు. నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసి సూపర్ హిట్ ప్రభుత్వం అని పేరు పొందినట్లు తెలిపారు. నేపాల్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలుగువారిని నారా లోకేష్ సురక్షితంగా స్వరాష్ట్రానికి రప్పించి స్వస్థలాలకు చేర్చారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, మాజీ ఎంపీపీలు బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, సర్పంచులు పైడిపాముల కృష్ణకుమారి, అరజా సంధ్యారాణి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పైడిపాముల స్వప్న, వైస్ ఎంపీపీ పిట్టి వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ మట్టా కోమలి, పీఏసీఎస్ చైర్మన్ అరజా రాధిక, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, ఏఎంసీ డైరెక్టర్లు, తెలుగు మహిళలు, వీర మహిళలు, కూటమి నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



# స్లీప్‌వెల్ దోమల వికర్షక ధూప కర్రలలో చట్టవిరుద్ధమైన రసాయనం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడి

**గుంటూరు, సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ :** భారతదేశంలో ఇళ్లలో వినియోగించే పురుగుమందుల యొక్క సురక్షిత వినియోగాన్ని ప్రోత్సహించే లాభాపేక్షలేని పరిశ్రమ సంఘం హోమ్ ఇన్సెక్ట్ కంట్రోల్ అసోసియేషన్ (హికా), అనుమతి లేని రసాయనాలను కలిగి ఉన్న అక్రమ దోమల వికర్షక ధూపం కర్రల (మస్కిటో రెపెల్లెంట్ ఇన్సెన్స్ స్టిక్స్ ) ముప్పు పెరుగుతోందని ఆంధ్ర ప్రదేశ్ & తెలంగాణ ప్రజలను హెచ్చరించింది. విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ నుండి సేకరించిన స్లీప్‌వెల్ దోమల వికర్షక ధూపం కర్రల నమూనాలలో "మెపర్ఫ్లుత్రిన్" ఉందని హికా నిర్వహించిన ప్రయోగశాల పరీక్షలు వెల్లడించాయి, ఇది దోమల వికర్షకాలలో ఉపయోగించడానికి అధికారులచే ఆమోదించబడని చట్టవిరుద్ధమైన రసాయనం. 'స్లీప్‌వెల్' దోమల వికర్షక ధూపం కర్రలను ఆషికా ఇన్సెన్స్ ఇంక్ తయారు చేస్తుంది. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కింద ఉన్న సెంట్రల్ ఇన్సెక్టిసైడ్స్ బోర్డు & రిజిస్ట్రేషన్ కమిటీ (సిబిఆర్ సి), భారతదేశంలో దోమల వికర్షకాలలో ఉపయోగించడానికి అనువైన రసాయనాలను ఆమోదించే అధికారం కలిగి ఉంది. దోమల వికర్షక మందులలో ఉపయోగించడానికి ఉద్దేశించిన ఏదైనా రసాయనాన్ని దేశంలో తయారు చేయడానికి, దిగుమతి చేసుకోవడానికి లేదా విక్రయించడానికి ముందు ఖచ్చితంగా సిబిఆర్ సి వద్ద నమోదు చేసుకోవాలి. ఇంకా, ప్రభుత్వం ఆమోదించిన ఏదైనా దోమల వికర్షకం సాధారణంగా సిబిఆర్ సి ఆమోదం పొందే ముందు కఠినమైన పరీక్షా ప్రక్రియకు లోనవుతుంది. ప్రభుత్వ సిబిఆర్ సి ఆమోదించిన దోమల వికర్షకాలు ప్యాకేజింగ్‌పై పేర్కొన్న రిజిస్ట్రేషన్ నంబర్ (సిఆర్ అంటే సెంట్రల్ ఇన్‌సెక్టిసైడ్ రిజిస్ట్రేషన్ నంబర్‌తో ప్రారంభమవుతాయి) కలిగి ఉంటాయి, ఇది ఉత్పత్తి యొక్క ప్రామాణికత, భద్రతకు హామీ ఇస్తుంది. మెపర్ఫ్లుత్రిన్‌ను సిబిఆర్ సి ఆమోదించలేదు కాబట్టి, దోమల వికర్షక ధూపం కర్రలలో దీనిని ఉపయోగించడం చట్టవిరుద్ధమైన చర్యగానే పరిగణించ బడుతుంది. ఈ రసాయనం కలిగి వున్న ధూపపు కర్ర ను ఇంటి లోపల ఉపయోగించినప్పుడు, ఈ అక్రమ దోమల వికర్షక ధూపం కర్రల నుండి వచ్చే పొగలు, వినియోగదారుల ఆరోగ్యానికి హానికరం కావచ్చు. ఎందుకంటే, దీని భద్రత, విషపూరిత తీరును సిబిఆర్ సి గుర్తించ లేదు లేదా ఆమోదించలేదు.

హోమ్ ఇన్‌సెక్ట్ కంట్రోల్ అసోసియేషన్ (హికా) గౌరవ కార్యదర్శి జయంత్ దేశ్‌పాండే ఈ పరిశోధనలపై మాట్లాడుతూ, "మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల ముప్పు నిరంతరం పెరుగుతున్నందున, నివారణ చాలా కీలకం. అయితే, భారతదేశం అంతటా ఇళ్లలోకి అక్రమ దోమల వికర్షక ధూపం కర్రల వాడకం విపరీతంగా పెరుగుతుండటం ఒక ముఖ్యమైన ఆందోళనగా పరిణమిస్తుంది. ఈ అక్రమ దోమల వికర్షక ధూపం కర్రలు స్లీప్‌వెల్ వంటి సందేహాస్పద పేర్లతో అమ్ముడవుతున్నాయి, సిబిఆర్ సి ఆమోదించని మెపర్ఫ్లుత్రిన్ వంటి అక్రమ రసాయనాలను కలిగి ఉన్నాయి. ఒక పరిశ్రమ సంఘంగా, దోమల వికర్షకాలను తయారు చేసే అన్ని కంపెనీలు, బ్రాండ్‌లు వినియోగదారుల భద్రతకు ప్రాధాన్య తనిచ్చేలా చూసుకోవడం హికా లక్ష్యం. ఇటువంటి అక్రమ దోమల వికర్షక ధూపం కర్రలను ఉపయోగించడం మానేసి, ప్యాకేజింగ్‌పై ముద్రించిన రిజిస్ట్రేషన్ నంబర్ (సిఆర్ తో ప్రారంభమయ్యే)తో ప్రభుత్వం ఆమోదించిన దోమల వికర్షకాలను మాత్రమే ఉపయోగించాలని హికా ప్రజలను గట్టిగా కోరుతోంది" అని అన్నారు. ఆయనే మాట్లాడుతూ "నకిలీ దోమల వికర్షక ధూపం కర్రలకు అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అవతరించాయి. ఈ తరహా అక్రమ దోమల వికర్షక ధూపం కర్రలు చట్టపరమైన, ఆర్థిక ప్రక్రియలకు దొరకకుండా కార్యకలాపాలను నిర్వహించటం కూడా చేస్తాయి. దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నుండి తమను తాము రక్షించుకోవడానికి, ప్రజలు ప్యాకేజింగ్‌పై ముద్రించిన రిజిస్ట్రేషన్ నంబర్ (సిఆర్ తో ప్రారంభమయ్యే) ఉన్న, ప్రభుత్వం ఆమోదించిన దోమల వికర్షకాలను మాత్రమే ఉపయోగించాలి" అని ఆయన అన్నారు.



## ముమ్మరంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలు ఏర్పాట్లు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా, దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకల ఏర్పాట్లలో, వియంసి మెయిన్ ఆఫీస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న హోల్డింగ్ ఏరియాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ ఆదేశాల మేరకు వియంసి మెయిన్ ఆఫీస్ వద్ద గల ఏపిసిపిడిసిఎల్ ఆఫీస్ ప్రాంగణంలో హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేసేందుకు అక్కడ పెరిగివున్న చెట్లను పిచ్చి మొక్కలను తొలగించే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎటువంటి లోపం లేకుండా విజయవాడ నగరపాలక



సంస్థ త్రాగునీరు, మరుగుదొడ్లు, ఉచిత చెప్పుల స్టాండ్ వంటి ఏర్పాట్లు చేస్తోందని, 39 ప్రాంతాలలో 25 లక్షల వాటర్ బాటిల్స్, 35 లక్షల వాటర్ ప్యాకెట్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని, 19 ప్రాంతాలలోను 405 తాత్కాలిక మొరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించారని, దేశ, విదేశ నలుమూలల నుండి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు 1490 సిబ్బందితో 24 గంటలు మూడు షిఫ్ట్ లలో పారిశుద్ధ్య నిర్వాహణ, ప్రజల సౌకర్యార్థం ఆరు ప్రాంతాలలో ఉచిత చెప్పుల స్టాండ్లు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వియంసి మెయిన్ ఆఫీస్ లో కమాండ్ కంట్రోల్లో విజయవాడ నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన ఏర్పాటులలో ఎటువంటి లోపం లేకుండా ఎప్పటికప్పుడు నివేదికలను సేకరిస్తూ, మౌలిక సదుపాయాలలో ఎటువంటి అవసరమైన వెంటనే కంట్రోల్ రూమ్ ద్వారా అందేటట్టు 24 గంటలు మూడు షిఫ్ట్ లలో సిబ్బంది పనిచేస్తారని, అంతేకాకుండా మోడల్ గెస్ట్ హౌస్ లో శాఖల సమన్వయంతో అక్కడ కూడా సిబ్బంది మరోవైపు పని చేయటానికి ఏర్పాట్లు చేశారని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.





# ప్రశ్నిస్తేనే పదవి నుంచి తొలగిస్తారా?



- స్కూల్ వైస్ చైర్మన్ కుంభా, లక్ష్మీ దుర్గ ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకం?
- పదవి నుండి తొలగించడానికి దుర్గ ఎమ్మార్వోకి బానిస కాదు?
- పురిటిగడ్డ పాఠశాల అంశం ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళతాం?
- జాతీయ గిరిజన ఫెడరేషన్ నేతలు లక్ష్మయ్య,వసంత్

**కృష్ణాజిల్లా మేజర్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద పిల్లలకు తినే బియ్యంలో పురుగులపై స్పందించి ప్రశ్నించిన పురిటిగడ్డ హైస్కూల్ వైస్ చైర్మన్ కుంభా లక్ష్మి దుర్గ ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకమని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్(ఎన్‌టిఎఫ్) కృష్ణాజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంభా లక్ష్మయ్య, దేవరకొండ వసంత్ పేర్కొన్నారు. శుక్రవారం పురిటిగడ్డలో కుంభా కనకదుర్గ ఇంటికి వెళ్లిన నేతలు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య, వసంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద పిల్లలకు అందజేస్తున్న సన్న బియ్యంలో తెల్లపురుగులు, ముక్క పురుగులు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రశ్నిస్తే దుర్గను పదవి నుంచి తొలగించాలంటూ అవమానకరంగా మాట్లాడుతూ బెదిరింపులకు గురిచేసిన చల్లపల్లి తహసిల్దార్ వనజాక్షి పై చర్యలు తీసుకోవాలని కోరారు.దుర్గ పట్ల ఎమ్మార్వో వ్యాఖ్యలు తన అగ్రకుల దురహంకారాన్ని తెలియజేస్తున్నాయన్నారు. విచారణకు వచ్చిన అధికారులు సమస్యను పరిష్కరించడానికి చూడాలి తప్ప సమస్యను వెలుగులోకి తెచ్చిన వారిని బెదిరిస్తారా ? అని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ పదవి నుండి తొలగించటానికి కనకదుర్గ ఎమ్మార్వో దగ్గర బానిస కాదన్న విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. లక్ష్మీదుర్గ పురుగులు బియ్యం గురించి ప్రశ్నించడం వల్లే అధికారులు అప్రమత్తమై రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బియ్యం అందేలా సమస్య పరిష్కారం కాబోతుందని స్పష్టం చేశారు.

ఎస్టీ కులానికి చెందిన వైస్ చైర్మన్ దుర్గను అవమానం, బెదిరింపులకు గురిచేసిన చల్లపల్లి తహసిల్దార్ వనజాక్షిపై చర్యలు తీసుకోవాలని, దుర్గకి ఎమ్మార్వో క్షమాపణలు చెప్పాలని నేతలు డిమాండ్ చేశారు. పురిటిగడ్డ స్కూల్ అంశాన్ని మంత్రి నారా లోకేష్‌తో పాటు రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లనట్లు లక్ష్మయ్య, వసంతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు దేవరకొండ నాగ లక్ష్మయ్య, కట్టా ప్రసాద్, రమాదేవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీగా కావాటి దామోదర్

**పార్టీ అభ్యున్నతికి ఎళ్లవేళలా కృషి చేస్తా..**

**మాజీ కార్పొరేటర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ కావాటి దామోదర్**



విజయవాడ, మేజర్ న్యూస్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి ఎళ్లవేళలా కృషి చేస్తానని వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా కావాటి దామోదర్ అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర "ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ" గా తనకు బాధ్యతను అప్పగించి, తనను అన్ని రకాలుగా ప్రోత్సహించిన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు యువ నాయకుడు దేవినేని అవినాష్ ని, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పెద్దలు కడియాల బుచ్చిబాబుని శనివారం మర్యాదగాపూర్వకంగా కలిసి తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ శాలువతో సత్కరించారు. అనంతరం వారి విలువైన సలహాలు, సూచనలు తీసుకుంటూ పార్టీకి అన్నివేళలా అందుబాటులో ఉంటూ పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని తన వంతు విజయవంతం అవటానికి కృషి చేస్తానని మాట ఇచ్చారు. మాజీ కార్పొరేటర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కావాటి దామోదర్ తోపాటు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సీనియర్ నాయకులు 17 డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ముదుకోటి కాసిం పాల్గొన్నారు.

# అంగన్వాడిలకు పెన్షన్ పంపిణీ డ్యూటీ నుండి మినహాయింపు ఇవ్వాలి

**ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్....**



**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 12, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో 19 మండలాలలో అంగన్వాడి కార్యకర్తలు 2024 జూలై నుంచి సామాజిక పెన్షన్ పంపిణీ చేస్తున్నారని, తెల్లవారు ఝామునే ఎక్కువ మొత్తంలో డబ్బును తీసుకొని వెళ్లి పంచటం, ట్రావెలింగ్, డబ్బులు పంచే విషయంలో అంగన్వాడీ మహిళలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అటువంటి పెన్షన్ పంపిణీ నుండి అంగన్వాడీలను మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మండలంలోని చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయము సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే ప్రీ స్కూల్, గర్భిణీ, బాలింతలకు ఫుడ్ పంపిణీతో కూడిన అంగన్వాడి కేంద్రం నిర్వహణ వివిధ రకాల సర్వేలు, రిపోర్టు వంటి వాటి వల్ల పని భారం ఎక్కువవుతుందని సెంటర్ నిర్వహణ కంటే అదనపు పనులే ఎక్కువ చేయాల్సి వస్తుందని దీనితో తాము శారీరకంగా, మానసికంగా ఆందోళన చెందుతున్నామని మరల ఇప్పుడు పెన్షన్లు కూడా పంపిణీ చేయాల్సి రావడంతో తమకు మరింత ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ డైరెక్టర్ అంగన్వాడీలకు ఎటువంటి పనులు అప్పగించవద్దని లెటర్ ఇచ్చారని, ఆ లెటర్ ప్రకారం తమ అంగన్వాడీలకు పెన్షన్ పంపిణీ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్ ఉమారాణి, షేక్ అల్లాబీ, కె శ్రీదేవి, బి కుమారి, జి రాంబాయి, ఎం ఉషారాణి, కె సత్యవాణి తదితర అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

## మచిలీపట్నం మూడ ఛైర్మెన్ పదవి పంతం వెంకట గజేంద్రరావుకే అవకాశం!?

**మరల మూడ ఛైర్మెన్ పదవి బీజేపీకే ఇచ్చే చాన్స్?**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం మూడ ఛైర్మెన్ పదవికి మట్టా ప్రసాద్ రాజీనామా చేసిన తర్వాత ఆ చైర్మన్ పదవి ఎవరని వరిస్తుంది అని ఆశావహులలో టెన్షన్ పెరిగింది. వీరిలో ముందు వరసలో పంతం గజేంద్ర రావు ఉన్నారు. మరల మూడ ఛైర్మెన్ పదవి బీజేపీకే ఇచ్చే అవకాశలు ఎక్కువ ఉండటంతో, బీజేపి పార్టీలో సీనియర్ నాయకుడు కావడంతో పాటు, బీజేపి రాష్ట్ర అధ్యక్షుడుతో కలిసి పనిచేసిన అనుభవం కూడా ఆయనకు కలసి వచ్చే అవకాశం, కూటమి నాయకులు అందరితో కూడా స్నేహపూర్వంగా వుండటం, మృదు స్వభావం, క్రమశిక్షణ గల నాయకత్వం, ఎవరితో భేదాభి ప్రాయాలు లేకపోవడంతో, మూడ ఛైర్మెన్ పదవి పంతం గజేంద్రరావుకే వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయినప్పటికి మూడ ఛైర్మెన్ పదవి కోసం బీజేపీ చెందిన పార్టీ నేతలు కొందరు ప్రయత్నం చేస్తున్నారు. అంతే కాకుండా టీడీపీ జనసేనా నాయకులు కూడా ఛైర్మెన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారికంగా ఎవరిని నియమిస్తారో వేచి చూడాలి...

## రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌కి గన్నవరం విద్యార్థినులు ఎంపిక



**గన్నవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అం డర్-19 ఫెన్సింగ్ (కత్తి సాము) పోటీలకు గన్నవరం హైస్కూల్ ప్లస్‌కు చెందిన నలుగురు బాలికలు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.సునీల శుక్రవారం పత్రికలకు తెలిపారు. విజయవాడ కృష్ణలంక ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో అస మాన నైపుణ్యం ప్రదర్శించిన ఈ. సాహితి (ద్వితీయ సం. యం.పి.సి), టి. రేవతి (ద్వితీయ సం. బై.పి.సి), జి. ప్రవీణ (ద్వితీయ సం.యం.పి.సి), యం. మౌనిక (ద్వితీయ సంవత్సరం బై.పి.సి)లను సెలెక్షన్ కమిటీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సునీల తెలిపారు. త్వరలో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ ఛాంపియ న్‌షిప్‌లో సాహితి, రేవతి, ప్రవీణ, మౌనికలు కృష్ణా జిల్లా అండర్-19 బాలి కల జట్టులో ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థినులకు ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన వ్యా యామ విద్య సహాయకులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్‌లను ప్రిన్సిపాల్ సునీలతో పాటు అధ్యాపక బృందం ఉమాదేవి, రాము, సుబ్రహ్మణ్యం, పద్మావతి, సుధాకర్, నాగేంద్ర అభినందించారు.

## 18 నుంచి అనలిటికా ల్యాబ్ ఇండియా, ఫార్మా ప్రో, ప్యాక్ ఎక్స్‌పో 2025

**విజయవాడ మేజర్ న్యూస్ :** జీవ శాస్త్రాలు, ఫార్మాస్యూటికల్ తయారీ రంగాలు సాంకేతి కత, ప్రపంచ భాగస్వామ్యాలు, పరిశోధన, ఆవిష్కరణల బలమైన పర్యావరణ వ్యవస్థ ద్వారా నడిపించబడుతూ, వేగవంతమైన పరివర్తన మార్గంలో ఉన్నాయి. ఈ ఊపు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు జరిగే సహ-స్థానంలో ఉన్న వాణిజ్య ప్రదర్శనలైన అనలిటికాల్యాబ్ ఇండియా, ఫార్మా ప్రో అండ్ ప్యాక్ 2025 వద్ద కలుస్తుంది. ప్రగతి కేంద్రంగా నిలబడిన ఈ సంవత్సరం ఎడిషన్, ఇప్పటి వరకు అత్యంత పెద్ద, వ్యాపార ఆధారిత వేదికగా ఉంటుందని వాగ్దానం చేస్తుంది. ప్రయోగశాల సాంకేతికత ఫార్మా ఆవిష్కరణలతో కలిసే ఒక కూడలిని సృష్టిస్తుంది. పరిశోధన భాగస్వామ్యాలు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న పరిష్కారాలకు నాంది పలుకుతాయి.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999